# బీహార్

# పట్టాదారులకే భూమి కోసం AIKMKS ఆధ్వర్యంలో నిరుపేదల ఆందోళనకారుల డిమాండ్

**గత** కొన్ని నెలలుగా, బీహార్ రాష్ట్రం - రోహతాస్‌లోనూ, మరి నాలుగు జిల్లాలలోనూ పేదలపై సాగుతున్న దాడులకు వ్యతిరేకంగా AIKMKS వివిధ రకాల ఆందోళనలు నిర్వహిస్తోంది.

2022 నవంబర్ 12న ఏఐకెఎమ్‌కెఎస్ రోహతాస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వందలాదిమంది ప్రజానీకం ప్రదర్శన, ఆపై 5 గంటలపాటు రాస్తారోకో జరిపిన అనంతరం బహిరంగసభ నిర్వహించింది. నితీష్‌కుమార్ ప్రభుత్వ నియంతృత్వ విధానాలను ఇంకెంతమాత్రం ప్రజానీకం సహించబోరని హెచ్చరించటంతో పాటు, తమ భూసమస్యను పరిష్కరించాలని ఈ సందర్భంగా ఆందోళనలో పాల్గొన్న ప్రజానీకం డిమాండ్ చేశారు.

"ప్రభుత్వ అధికారులారా, మా పట్టా భూములను కబ్జా చేస్తున్న భూ బకాసురులకు మీరందిస్తున్న తోడ్పాటును ఇక మేమెంత మాత్రము సహించము; ఈ గూండాల పట్ల మీ ఉదార వైఖరిని మేము అంగీకరించబోము". "వారికి మద్దతునిస్తూ వారితో కుమ్మక్కు అయిన పోలీసులు నశించాలి". "న్యాయవ్యవస్థను అమ్మకానికి బెట్టి సొమ్ము చేసుకుంటున్న ఉన్నతాధికార వర్గం.... సిగ్గుసిగ్గు" అనేవి ఆందోళన సందర్భంగా మార్మోగిన నినాదాలలో కొన్ని మాత్రమే.

భూమిలేని నిరుపేద కుటుంబాలన్నింటికీ 6 సెంట్ల నివాస భూమిని ఇవ్వాలని, ఆక్రమణల పేరుతో భూముల నుండి పేదవారిని ఖాళీ చేయించటాన్ని ఆపివేయాలని, నిరుపేదలకు విద్యుత్ బిల్లులను రద్దు చేయాలనే డిమాండ్లను ఈ భారీ ప్రదర్శన, సభ ద్వారా ప్రభుత్వం ముందుంచారు.

రోహతాస్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగిన ఈ సభకు ఏఐకెఎమ్‌కెఎస్ జిల్లా అధ్యక్షులు నథూనిరామ్ అధ్యక్షత వహించారు. సంఘ నాయకులు కామ్రేడ్ అశోక్ బైతా, జిల్లా కార్యదర్శి కా॥ సురేంద్ర పాశ్వాన్ తదితరులు ఈ సభలో ప్రసంగించారు.

అమీర్‌దాస్ నివేదికను ఇప్పటికీ దాచి వుంచారని, దాని వెంటనే బహిరంగపరచాలని, డి. బందోపాధ్యాయ కమీషన్ నివేదిక ఈనాటికి కూడా అమలుకు నోచుకోలేదని వక్తలు తమ ప్రసంగాల్లో పేర్కొన్నారు. బీహార్‌లో నితీష్‌కుమార్ ప్రభుత్వంలో ఉన్నతాధికారుల నియంతృత్వచర్యల ఫలితంగా ప్రజా జీవితాలు విధ్వంసమవుతున్నాయని వారు అన్నారు. ప్రజల ప్రయోజనం కొరకు ఏ కార్యక్రమమూ చేపట్టం జరగటంలేదని, వివిధ ప్రభుత్వ శాఖలలో లంచాల విధానము సృష్టించబడిందని వారు విమర్శించారు.

బలహీనవర్గాల భూములను మాఫియాలు కబ్జా చేస్తున్నారని, పట్టాదారుల భూములను గూండాలు బలప్రయోగంతో ఆక్రమించుకుంటున్నారని, ఇవన్నీ పోలీసుల సహాయ సహకారాలతో సజావుగా సాగిపోతున్నాయని వివరించారు. పేద ప్రజలకు ఎక్కడా భూములను కేటాయించటం జరగలేదని, కానీ రాష్ట్ర ప్రభుత్వ తోడ్పాడుతో నకిలీ దస్తావేజులను పుట్టించుకొన్న మండల స్థాయిలోని అధికారులంతా 'భూదాన్' భూములను భారీస్థాయిలో స్వాధీనం చేసుకుంటున్నారని వివరించారు. ఈ ఆక్రమణదారులకు 'జమా-బందీ' రసీదులు కూడా లేవన్నారు. 1970 సర్వే 'ఖటియాన్' ప్రకారం నమోదు చేసిన ప్రతి గ్రామంలోని భూముల వివరాలన్నీ అందుబాటులో వున్నప్పటికీ, భూమాఫియాలు, భూకబ్జాదారులైన ఉన్నతాధికారులు భూదాన్ భూములను తమ పేరిట మార్పించుకోవటమే గాకుండా, ఆ భూములనే ప్రస్తుతం భూమిలేని నిరుపేదలకు అమ్ముతున్నారన్నారు.

కన్సాలిడేషన్ శాఖ, భూదాన్ శాఖలు సంవత్సరాల తరబడి ఈ క్రీడను సాగనిస్తూ పేదల హక్కులను కాలరాస్తున్నాయని వక్తలు పేర్కొన్నారు. భూములు ప్రజల హస్తగతమయ్యేంతదాకా పోరాటం కొనసాగి తీరుతుందని వక్తలు ప్రకటించారు.

*****